

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 04-03-2025 | సంపుటి - 21 | సంచిక - 313 | రూ : 4 | పేజీలు: 8




# కృష్ణా జలాల్లో తెలంగాణకు 70% వాటా

- తెలంగాణకు కేటాయించండి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్‌లకు అనుమతులివ్వండి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- గోదావరిపై రాష్ట్ర ప్రాజెక్టులకు శాశ్వత కేటాయింపులు జరపాలని విన్నపం
- ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం-బనకచర్లపై ఫిర్యాదు
- సాగునీటి పథకాలకు 50 ఏళ్ల కాలానికి వడ్డీలేని రుణం అందించాలని అభ్యర్థన

దిల్లీ: "కృష్ణా నదీ పరీవాహకం 70% తెలంగాణలో ఉంటే 30% మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. అందువల్ల కృష్ణా జలాల్లో 70% వాటా తెలంగాణకు కేటాయించండి. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తర్వాతే ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోండి" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విన్నవించారు. ఆయన సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి దిల్లీలో కేంద్ర మంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీలను తరువాయి 2లో

## ఐదు నిమిషాలు..
# ఆలస్యమైనా అనుమతి

- ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు వెసులుబాటు
- పరీక్ష కేంద్రం లొకేషన్ గుర్తించేలా హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్
- చేతిగడియారాలనూ అనుమతించం
- ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- రేపటి నుంచి పరీక్షలు.. హాజరుకానున్న 9.96 లక్షల మంది

హైదరాబాద్: 'ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఈ సారి ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన వర్తించదు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాలు.. అంటే ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తాం.. కాకపోతే ముందుగా వస్తే ఆందోళన లేకుండా రాసుకోవచ్చు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు ముందుగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలి' అని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సూచించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈనెల 5న ప్రారంభం కానున్న నేపథ్యంలో బోర్డు కార్యాలయంలో సోమవారం పరీక్షల విభాగం కంట్రోలర్ తరువాయి 2లో




## ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా
# కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి





- కరీంనగర్‌లో మొదటి ప్రాధాన్య ఓట్లతో భాజపా బలపరిచిన అభ్యర్థి విజయం
- నల్గొండ స్థానంలో హోరాహోరీ.. పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిని వరించిన గెలుపు
- సిటింగ్‌లకు చేదు అనుభవం
- పట్టభద్రుల ఎన్నికలో భారీగా చెల్లని ఓట్లు

హైదరాబాద్ నల్గొండ, కరీంనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్, మరో చోట భాజపా మద్దతుతో బరిలో దిగిన అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి నల్గొండవరంగల్ ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించగా; ఉమ్మడి కరీంనగర్‌నిజామాబాద్‌ఆదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ తరువాయి 2లో



## ఈ నెలలోనే
# డీఎస్సీ...

- పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహిస్తాం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మంత్రి లోకేశ్

అమరావతి: ఈ నెలలోనే మెగా డీఎస్సీ ఇస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఉండవల్లి నివాసంలో కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో... హేతుబద్ధీకరణకు ఉద్దేశించిన

తరువాయి 2లో

# గిర్ అభయారణ్యంలో మోదీ సఫారీ

సాసన్ (గుజరాత్): ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లాలో ఉన్న గిర్ అభయారణ్యంలో పర్యటించారు. సింహాల్ని చూడడానికి సఫారీ చేశారు. వీటి ఆవాస ప్రాంతాన్ని సంరక్షించడంలో చుట్టుపక్కల ప్రాంతాల్లోని గిరిజనులు, మహిళలు చేస్తున్న కృషిని కొనియాడారు. "గిర్ ప్రాంతానికి రాగానే గుజరాత్ తరువాయి 2లో



## మీరు మాట్లాడేది మనుషుల గురించేనా?

- పని గంటలపై అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు

2లో





# యుద్ధం ముగింపు ఇంకా సుదూరమే

- అమెరికా సాయంపై ఇంకా ఆశాభావంగానే ఉన్నాం
- ఇప్పటిదాకా అందించిన సహకారంపై రుణపడి ఉంటాం
- ట్రంప్‌తో మరోసారి భేటీకి సిద్ధమే: జెలెన్‌స్కీ

లండన్, కీవ్: రష్యాతో యుద్ధం ముగింపు ఇంకా సుదూర తీరంలోనే ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. అప్పటిదాకా అమెరికా సహకారం అందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దేశంతో డీల్‌కు తాను సిద్ధమేనని, ట్రంప్‌తో భేటీకి సిద్ధంగానే ఉన్నానని, ఇప్పటిదాకా అమెరికా అందించిన సాయంపై తమ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌రష్యా యుద్ధం తరువాయి 2లో

# అన్నీ మంచి శకునములే!

- రాష్ట్ర ఆర్థిక వృద్ధి 12.94%
- తలసరి ఆదాయం రూ.2,68,653
- అనుకూల వాతావరణం.. అధిక పంట ఉత్పత్తులు
- పరిశ్రమలు, సేవా రంగాల్లోనూ పురోగతి
- 2024-25 ఆర్థిక సర్వే వెల్లడి
- శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం



అమరావతి : రాష్ట్ర ఆర్థిక సర్వే ఎన్నో శుభసంకేతాలు ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12.94% వృద్ధి సాధించబోతున్నట్లు పేర్కొంది. వ్యవసాయ, అనుబంధ, పారిశ్రామిక, సేవా తదితర రంగాల్లో వృద్ధి వల్లే ఈ పురోగతి సాధ్యమవుతుందని విశ్లేషించింది. 'మంచి వర్షాలు పడటం వల్ల రంగాల్లోనూ పురోగతి కనిపిస్తోంది. వెరసి రాష్ట్రంలో రూ.16.06 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తి సాధ్యమవుతుంది' అని ఆర్థిక సర్వే విశ్లేషించింది. 202425 ఆర్థిక సర్వేను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం శాసనసభ ముందుంచింది. స్వర్ణాంధ్ర విజన్ సూచీల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆర్థిక, మానవ వనరులను సద్వినియోగపరుస్తూ, మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మలచనున్నట్లు పేర్కొంది. ఆహారధాన్యాల ఉత్పత్తి గతేడాది కన్నా అధికంగా ఉంది. రానున్న ఐదేళ్లలో సాగు రంగంలో వచ్చే మార్పులతో ఈ వృద్ధిని మరింత

తరువాయి 2లో

# కృష్ణా జలాల్లో తెలంగాణకు 70% వాటా

(మొదటిపేజీ తరువాయి)

కలిశారు. రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందించారు. "కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66%, తెలంగాణకు 34% నీటి కేటాయింపులు చేసింది. ఫలితంగా మేం ఏళ్లుగా నష్టపోతూ వస్తున్నాం. ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్... తన కేటాయింపులకు మించిన నీటిని తరలించుకుపోయింది. ఇకపై నీటి తరలింపు జరగకుండా చూడటంతోపాటు కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలిమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయండి. అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని మేమే భరిస్తాం. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతులివ్వలేదు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్‌భద్రకు మాత్రం అనుమతులిచ్చారు" అని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

*** పునర్విభజన చట్టానికి విరుద్ధంగా 'బనకచర్ల'**

ఉమ్మడి రాష్ట్ర పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ గోదావరిబనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని జలశక్తి మంత్రి పాటిల్‌కు రేవంత్‌రెడ్డి ఫిర్యాదుచేశారు. ఈ పథకానికి ఏపీ ప్రభుత్వం... కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదని తెలిపారు. ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న ఎపెక్స్ కౌనిల్స్‌లోనూ ఎటువంటి చర్చ జరగలేదని తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. పాలమూరురంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడికుంట వాగు, చనాఖా కోర్టా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ) కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని విన్నవించారు. మౌలిక వసతుల అభివృద్ధి కింద తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు 50 ఏళ్ల కాలానికి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. సమావేశానంతరం విలేకర్లతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, వాటికి నీటి కేటాయింపులు, వినియోగంలో సమస్యలపైనే కేంద్రమంత్రితో చర్చించామన్నారు. గోదావరిమూసీ అనుసంధానంపై ఇటీవలే ప్రధానికి వివరించామని, దానిపై నివేదిక అడిగినప్పుడు తప్పకుండా అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జలశక్తి మంత్రికి ఎస్ఎల్‌బీసీ ప్రమాదం గురించి వివరించామన్నారు. సముద్రంలో కలుస్తున్న గోదావరి నీటిని ఉపయోగించుకొనేందుకు చేపడుతున్న 'బనకచర్ల'పై తెలంగాణకు అభ్యంతరాలు అవసరం లేదని ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా రేవంత్ స్పందిస్తూ... "మేం గోదావరి నికర జలాల ఆధారంగా నిర్మిస్తున్న సమ్మక్కసారక్క, సీతారామ, ఇతర ప్రాజెక్టులకు ఇప్పటివరకు కేటాయింపులే జరగలేదు. సముద్రంలో కలిసే గోదావరి నీటిని వాడుకోవడానికే ప్రాజెక్టులు కడుతున్నామంటున్న ఆంధ్రప్రదేశ్... తెలంగాణ ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం పెడుతోంది? మా శాశ్వత ప్రాజెక్టులకు శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే మీకు వరద జలాలు ఉన్నాయా? లేదా? అన్నది తెలుతుంది. అనంతరమే ఏపీ చేపడుతున్న ఇతర ప్రాజెక్టులకు అనుమతివ్వాలి. మరోవైపు... మేం చేపట్టిన సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ నుంచి తుది అనుమతులు రాలేదు. వాటి విషయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం పెట్టింది. దానివల్లే మేం పదేపదే సీడబ్ల్యూసీ వద్దకు వచ్చి వాటిపై విన్నవించాల్సి వస్తోంది. గోదావరి వరద జలాలను బనకచర్ల ద్వారా కృష్ణాబేసిన్‌కు తరలిస్తామంటున్న ఆంధ్రప్రదేశ్ మా నికరజలాల ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం పెడుతోంది? మా ప్రాజెక్టులు పూర్తయి, ఆయకట్టు స్థిరీకరణ జరగకముందే ఆంధ్రప్రదేశ్ టెయిల్‌ఎండ్‌లో వరద జలాల ఆధారంగా కట్టుకున్న ప్రాజెక్టులకు ఆయకట్టు స్థిరీకరణ జరిగితే నీటికేటాయింపుల సందర్భం వచ్చినప్పుడు పూర్తయిన ప్రాజెక్టుల ఆయకట్టుకే తొలుత కేటాయింపులు జరుపుతామంటారు. అందుకే గోదావరిపై వరదజలాల లెక్క తేలిన తర్వాత... వారు ఏం నిర్మిస్తున్నారన్న దానిపై ఏపీ డీపీఆర్ ఇస్తే జీఆర్ఎంబీలో చర్చించి వాటిపై అభ్యంతరం ఉందా? లేదా? అన్నది చెబుతాం. మేం శాశ్వతంగా నికరజలాలపై కడుతున్న ప్రాజెక్టులపై అభ్యంతరం వ్యక్తంచేస్తున్న ఆంధ్రప్రదేశ్ తొలుత వాటిని ఉపసంహరించుకోవాలి. ఎన్డీయేలో వాళ్లు భాగస్వాములుగా ఉన్నందున మా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలి.

# అన్నీ మంచి శకునములే!

(మొదటిపేజీ తరువాయి)

* పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తయారీ, బ్యాంకింగ్, బీమా ఆదాయం.. అప్పులు.. లోటు..

* రాష్ట్ర తలసరి ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,68,653గా ఉంది. జాతీయ సగటు రూ.2,00,162 కన్నా ఇది ఎక్కువ.

* ఈ ఏడాదిలో సొంత పన్నుల ద్వారా రూ.94,967 కోట్లు, పన్నేతర రాబడుల నుంచి రూ.7,018 కోట్లు, కేంద్ర బదలాయింపుల ద్వారా రూ.89,157 కోట్ల ఆదాయం వచ్చింది.

* చేబదుళ్లు, ప్రజారుణం చెల్లింపులు పోనూ, 202324లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,36,512 కోట్లు ఖర్చుచేయగా, 2024 25లో రూ.2,49,418 కోట్లు వెచ్చించనుంది.

* రాష్ట్ర అప్పు 202324 చివరి నాటికి రూ.4,91,734 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.5,64,488 కోట్లకు చేరనుంది.

* 202324లో రెవెన్యూ లోటు రూ.38,683 కోట్లు, ద్రవ్య లోటు రూ.62,720 కోట్లు కాగా, 2024 25 ఆఖరు నాటికి ఇవి వరుసగా రూ.48,311 కోట్లు, రూ.73,362 కోట్లు ఉండొచ్చని సర్వే అంచనా వేసింది.

**సాగు, ఉత్పత్తి భేష్**

రాష్ట్రంలో జూన్ నుంచి డిసెంబరు వరకు సగటు వర్షపాతం 860 మిల్లీమీటర్లు కాగా 2024లో ఈ కాలానికి 960.3 మి.మీ. కురిసింది. 11.7% అదనపు వర్షపాతం నమోదైంది. ఆహార పంటల సాగు పెరిగింది. 202324లో 33.24 లక్షల హెక్టార్లలో పంటలు వేయగా, ఈ ఏడాది 37.51 లక్షల హెక్టార్లలో సాగైంది. 12.85% వృద్ధి నమోదైంది. గతేడాది 143.31 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి రాగా, ఈ ఏడాది 161.86 లక్షల టన్నులుగా అంచనా వేస్తున్నారు. వరి ధాన్యం ఉత్పత్తి 127.15 లక్షల టన్నులు రావొచ్చని అంచనా. కిందటి ఏడాదితో పోలిస్తే ఇది 12.95% అధికం. మంచి వర్షాలు, చక్కని నీటిపారుదల సౌకర్యాలు, పంట మార్పిడి విధానాల వల్ల ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల సాధ్యమవుతోందని ఆర్థిక సర్వే విశ్లేషించింది. 18.23 లక్షల హెక్టార్లలో సాగవుతున్న పండ్ల తోటలతో దేశంలోనే పండ్ల ఉత్పత్తిలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. వచ్చే ఐదేళ్లలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అత్యధిక వృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వడ్డీలేని రుణాలు, మౌలిక సౌకర్యాల మెరుగుదల, రాయితీపై విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీ, పెట్టుబడి లేని ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తూ ఈ లక్ష్యాన్ని చేరుకోవాలన్నది ప్రణాళిక. కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. 2025 జనవరి నాటికి 9,13,283 మంది కౌలురైతులకు ఈకార్డులు అందించగా, వారిలో 2 లక్షల మందికి రూ.2,848 కోట్ల రుణాలు ఇప్పించింది.

# గిర్ అభయారణ్యంలో మోదీ సఫారీ

(మొదటిపేజీ తరువాయి)

సీఎంగా నేను ఉన్నప్పుడు ఇక్కడి ప్రజలతో కలిసి చేసిన ప్రయత్నాలు మదిలో మెలగుతున్నాయి. కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉమ్మడి ప్రయత్నాల వల్ల మృగరాజుల సంఖ్య స్థిరంగా పెరుగుతోంది. వీటితోపాటు పులులు, చిరుతలు, ఖడ్గమృగాల సంఖ్యా వృద్ధి చెందుతోంది. వన్యప్రాణులపై మనకున్న బలమైన ఆపేక్షను, వాటి ఆవాసాలు సుస్థిరంగా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఇవి చాటుతున్నాయి" అని 'ఎక్స్'లో రాశారు. తనకు తారసపడిన సింహాల ఛాయాచిత్రాలనూ జతచేశారు. ఆసియా సింహాల సంరక్షణకు కేంద్రం రూ.2,900 కోట్లు మంజూరు చేసిందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

**భారతీయ నదుల్లో 6,327 డాల్ఫిన్లు**

సాసన్ గిర్‌లో జాతీయ వన్యప్రాణి మండలి (ఎన్‌బీడబ్ల్యూఎల్) సమావేశానికి ప్రధాని అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండలి ఒక నివేదిక విడుదల చేసింది. మన దేశంలోని నదుల్లో 6,327 డాల్ఫిన్లు ఉన్నాయని అది వెల్లడించింది. డాల్ఫిన్లపై ఇలాంటి నివేదిక ఇదే తొలిసారి అని అధికార వర్గాలు తెలిపాయి. ఎనిమిది రాష్ట్రాల్లో 28 నదుల్లో సర్వే నిర్వహించి దీనిని రూపొందించారు. మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో మాదిరిగా గుజరాత్‌లోని బన్నీ గ్రాస్‌లాండ్స్‌లో, మధ్యప్రదేశ్‌లోని గాంధీసాగర్ అభయారణ్యంలోనూ చీతాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సింహాల సంఖ్యను లెక్కతేల్చే పని మే నెలలో జరుగుతుందని చెప్పారు. పులుల సంరక్షణకు, అంతరించిపోతున్న బట్టబాతు పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళికలను ఆవిష్కరించారు. కార్చిచ్చులను నిర్మూలించడంలో ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటివాటి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. పులులను కాపాడేందుకు అంతర్జాతీయ కూటమి ఏర్పాటు చర్యల్ని సమీక్షించారు. అటవీ సిబ్బందికి మోటారుసైకిళ్లు అందజేశారు.

# యుద్ధం ముగింపు ఇంకా సుదూరమే

(మొదటిపేజీ తరువాయి)

ముగింపుపై చర్చించేందుకు ఆదివారం లండన్‌లో ఐరోపా దేశాధినేతల సమావేశం జరిగింది. ఇందులో జెలెన్‌స్కీ పాల్గొన్నారు. అనంతరం ఆయన ఉక్రెయిన్‌కు బయలుదేరేముందు వీడియో సందేశం విడుదల చేశారు. 'అమెరికాతో మా సంబంధాలు కొనసాగుతాయనే అనుకుంటున్నా. ఎందుకంటే అవి సందర్భానుసారం నెలకొనే సంబంధాల కంటే ఎక్కువ. అమెరికాతో మాకు బలమైన బంధం ఉందని నమ్ముతున్నా. ఆ సత్సంబంధాలను కాపాడుకోగలను. నిర్మాణాత్మక చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానిస్తే మరోసారి భేటీకి వెళ్తా. తీవ్రమైన, నిజమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఎప్పుడూ నేను సిద్ధమే. ఖనిజాల ఒప్పందంపై ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే దానిపై సంతకం చేసేందుకూ సిద్ధమే' అని స్పష్టం చేశారు. 'ఐరోపా నుంచి మాకు పూర్తి మద్దతు ఉందనేది మరోసారి స్పష్టమైంది. శాంతి పునరుద్ధరణ అనే ప్రధాన అంశంపై అంతా ఐక్యంగా ఉన్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో మాకు వాస్తవమైన భద్రతా హామీలు ముఖ్యం. యూకే, ఐరోపా సమాఖ్య, తుర్కియే వంటి దేశాలు దీనిపై కృత నిశ్చయంతో ఉన్నాయి. ఇక్కడ అమెరికా ప్రాధాన్యాన్నీ మనం అర్థం చేసుకోవాలి. ఆ దేశం నుంచి మాకు అందుతున్న సాయంపై మేం ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. వారికి కృతజ్ఞతలు తెలపని రోజు లేదు. మా స్వాతంత్ర్యాన్ని కాపాడుతున్న వారికి ధన్యవాదాలు. సుదీర్ఘ యుద్ధం కాదు.. మాకు శాంతి కావాలి. అందుకే భద్రతా హామీలు ముఖ్యమని మేం చెబుతున్నాం' అని వివరించారు.

జెలెన్‌స్కీది చెత్త ప్రకటన: ట్రంప్

వాషింగ్టన్: రష్యాతో యుద్ధం ముగింపు సుదూరమేనన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. 'అదో చెత్త ప్రకటన. అమెరికా ఈ యుద్ధాన్ని మరింత కాలం కొనసాగనీయదు. అమెరికా, ఐరోపా సాయం చేస్తున్నంత కాలం జెలెన్‌స్కీ శాంతిని కోరుకోరు. ఐరోపా దేశాల సదస్సులో వారంతా ఆయనకు మద్దతుగా నిలిచారు. అయితే అమెరికా లేకుండా శాంతి స్థాపనకు కృషి చేయలేమని తెలిపారు. రష్యాకు వ్యతిరేకంగా బలం చూపాలని అనుకునేవారు ఇటువంటి ప్రకటన చేయడం గొప్ప కాదు. అసలు వాళ్లేం ఆలోచిస్తున్నారు' అంటూ తన సోషల్ మీడియా సంస్థ ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు.

# మీరు మాట్లాడేది మనుషుల గురించేనా?

లఖ్‌నవూ: ఉద్యోగుల పని గంటలపై దిగ్గజ పారిశ్రామికవేత్తలు వివిధ రకాల అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై తాజాగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు. "ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సలహా ఇస్తున్నవారు.. మనుషుల గురించి కాకుండా రోబోల గురించి మాట్లాడటం లేదుకదా?. ఎందుకంటే, మనుషులైతే.. భావోద్వేగాలతో మెలగాలని, కుటుంబంతో కలిసి జీవించాలని అనుకుంటారు. ఎవరో కొద్దిమందికి కాకుండా దేశప్రజలందరికీ లబ్ధి చేకూర్చేదే నిజమైన ఆర్థిక పురోగతి. పనిలో నాణ్యత ముఖ్యం. ఉన్నత హోదాలో కూర్చున్న వ్యక్తులు.. యువత పడే శ్రమ నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందుతున్నారన్నది నిజం.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలో భాజపా మద్దతు పలికిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందారు. ఈ రెండో చోట్లా సిటింగ్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్‌నిజామాబాద్‌ఆదిలాబాద్‌మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 10 గంటల తర్వాతే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఇంకా చెల్లిన, చెల్లని ఓట్లను వేరుచేస్తున్నారు. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టనుండడంతో కౌంటింగ్ ఆలస్యం కానుంది. ఈ గ్రాడ్యుయేట్ స్థానంలో భారీగా ఓట్లు చెల్లుబాటు కాకపోవడం గమనార్హం. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగగా.. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, నల్గొండ జిల్లాలోని ఆర్జాలబావిలో కౌంటింగ్ జరిగింది. భాజపా బలపరిచిన అభ్యర్థులు మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయగా, కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మాత్రమే పోటీ చేసింది.

**5,777 ఓట్ల ఆధిక్యంతో..**

ఉమ్మడి కరీంనగర్‌మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా భాజపా బలపరిచిన అభ్యర్థి మల్క కొమరయ్య పీఆర్టీయూ(టీఎస్) అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 15 మంది అభ్యర్థులు ఈ స్థానంలో పోటీపడగా తొలి ప్రాధాన్య ఓట్లతోనే కొమరయ్య విజయాన్ని అందుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన కూర రఘోత్తంరెడ్డి కేవలం 428 ఓట్లు మాత్రమే సాధించారు. మొత్తంగా ఈ స్థానంలో 25,041 ఓట్లు పోలవగా 24,144 చెల్లుబాటయ్యాయి. 897 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. పోలైన ఓట్లలో 50 శాతానికి మించి(12,074) ఓట్లు విజేతకు రావాల్సి ఉండగా కొమరయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి గెలుపొందిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

**ఎవరికి ఎన్ని ఓట్లంటే..**

కొమరయ్య 12,959, వంగ మహేందర్‌రెడ్డి 7,182, వై.అశోక్‌కుమార్ 2,621, కూర రఘోత్తమ్‌రెడ్డి 428, తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి 320, యాటకారి సాయన్న 293, మామిడి సుధాకర్‌రెడ్డి 153, ఎల్.సుహాసిని 78, గవ్వల లక్ష్మి 41, ముత్తారం నర్సింహస్వామి 31, కంటె సాయన్న 12, జగ్గు మల్లారెడ్డి 10, సిలివేరి శ్రీకాంత్ 7, చాలిక చంద్రశేఖర్ 6, వేముల విక్రమ్‌రెడ్డి 3 ఓట్లు సాధించారు.

**ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టి..**

ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిక హోరాహోరీగా సాగింది. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపొందారు. యూటీఎఫ్‌నకు చెందిన సిటింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. గెలుపు కోసం 11,281(50శాతం) ఓట్లు సాధించాల్సి ఉండగా మొదటి ప్రాధాన్య ఓట్లలో అత్యధికంగా పింగిళి శ్రీపాల్‌రెడ్డికి (పీఆర్‌టీయూటీఎస్) 6,035 ఓట్లు వచ్చాయి. గెలుపునకు అవసరమైన వాటికంటే 5,246 తక్కువగా వచ్చాయి. దీంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు మొదలుపెట్టి దిగువ నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు లభించడంతో ఆయనను విజేతగా ప్రకటించారు. మొత్తం ఓట్లలో చెల్లనివి 494 ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. మొత్తం 25,797 ఓట్లకు 24,135 ఓట్లు పోలయ్యాయని, వాటికి సంబంధించిన ఫలితాలనే వెల్లడిస్తామని ఆర్వో, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించడం చర్చనీయాంశమైంది. పోలింగ్ జరిగిన తర్వాత అధికారికంగా మొత్తం 24,139 ఓట్లు పోలయ్యాయని వెల్లడించడమే కాకుండా సోమవారం లెక్కింపు సమయంలోనూ ఈ సంఖ్యనే ప్రకటించారు. మధ్యాహ్నం మొదటి రౌండ్ ఫలితాలు ప్రకటించే సమయానికి నాలుగు ఓట్లను తగ్గించడంపై ఆమె స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయమై విలేకరులు ప్రశ్నించగా.. సమాధానాన్ని దాటవేశారు. 24,135 ఓట్లే ప్రామాణికమంటూ తేల్చారు. ఇందులో చెల్లని ఓట్లు 494 పోనూ మొత్తం 23,641 ఓట్లుగా తేల్చారు.

**మొదటి ప్రాధాన్యంలో ఎవరికెన్ని ఓట్లు వచ్చాయంటే..**

పింగిళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్) 6,035, అలుగుబెల్లి నర్సిరెడ్డి (యూటీఎఫ్) 4,820, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (టీపీఆర్‌టీయూ) 4,437, పూల రవీందర్ (బీసీ జేఏసీ, ఎస్టీయూ) 3,115, పులి సరోత్తంరెడ్డి (భాజపా) 2,289, సుందర్‌రాజ్ యాదవ్ 2,040, వెంకటస్వామి 421, బాబూరావు 128, శంకర్ 113, చంద్రమోహన్ 100, రాజేశ్ 36, కైలాసం 26, గోపాల్‌రెడ్డి 24, స్వాతి 19, వెంకటేశ్వర్లు 15, పురుషోత్తంరెడ్డి 11, రాజు 7, సాయన్న 4, చంద్రశేఖర్ 1 ఓటు సాధించారు.

# ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

జయప్రద బాయి, సంయుక్త కార్యదర్శులు భీమ్‌సింగ్, మోహన్, జ్యోత్స్న తదితరులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పూర్తి చేయాలని, ఎవరికి వారు తమకిచ్చిన పత్రంపై తమ వివరాలే ఉన్నాయా? లేవా? అని సరిచూసుకోవాలన్నారు.

**ముఖ్యాంశాలు.. సూచనలు..**

* ఈసారి హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించాం. దాన్ని స్కాన్ చేసి పరీక్షా కేంద్రం లొకేషన్ తెలుసుకోవచ్చు. ఒక రోజు ముందుగా కేంద్రాన్ని పరిశీలించడం అన్ని విధాలా మంచిది.

* ప్రశ్నపత్రంపై సీరియల్ నంబరు ముద్రిస్తున్నాం. ఏ సంఖ్య పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో దాని వల్ల తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదని తెలుసుకుంటారు.

* ప్రశ్నపత్రంలో ఏమైనా పొరపాట్లు ఉంటే పరీక్ష ప్రారంభమైన తర్వాత సవరించుకోవాలని (ఎరాటా) సమాచారం ఇస్తాం. ఇన్విజిలేటర్లు ఆ విషయాన్ని చెబుతారు. ఆ ప్రకారం విద్యార్థులు సరిచేసుకొని సమాధానాలు రాయాలి.

* గత ఏడాది వరకు సాధారణ (అనలాగ్) చేతిగడియారాలను అనుమతించేవాళ్లం. కాకపోతే ఏది అనలాగ్, ఏది స్మార్ట్ వాచ్ అనేది వందల మంది విద్యార్థులు వచ్చినప్పుడు గుర్తించే పరిస్థితి ఉండకపోవచ్చు. అందుకే ఈసారి ఏ రకమైన చేతిగడియారాలనూ అనుమతించడం లేదు.

* బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించాం. ఒక్కో జిల్లాకు ఒక్కో స్క్రీన్‌ను ఏర్పాటు చేశాం. మొత్తం 75 మంది సిబ్బంది పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తుంటారు.

# ఈ నెలలోనే డీఎస్సీ

(మొదటిపేజీ తరువాయి)

జీఓ 117ను రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా తీసుకురాబోతున్న విధానాలను వివరించారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టం, పదోన్నతులు, బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టతనిచ్చారు. రాజకీయాలకు అతీతంగా విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, పిల్లలకు ఇచ్చే కిట్లపై నేతల చిత్రాలు లేకుండా చేశామని చెప్పారు. శాసనసభ్యుల విజ్ఞప్తి మేరకు పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకురాబోతున్న ఐదు రకాల బడుల విధానం, ఆదర్శ పాఠశాలల గుర్తింపు, ఏర్పాటుకు తీసుకోబోయే చర్యలను వివరించారు. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో నిర్ణీత దూరం కంటే ఎక్కువ ఉన్న వారికి రవాణా భత్యం ఇస్తామని ప్రజాప్రతినిధులకు అధికారులు తెలిపారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలు, సూచనలను వ్యక్తం చేశారు.

# గ్రామీణ కళలను పడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**- ముప్పిడి సైదులు గౌడ్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామాలలో అంతరించిపోతున్న గ్రామీణ కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి సైదులు గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి ముఖ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామీణ కళలను కాపాడడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరంగ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా గ్యార కృష్ణ, ఉపాధ్యక్షునిగా పాశం రామరాజు, ప్రధాన కార్యదర్శిగా బడుగు బాలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# టీఎన్జీవోస్ నేతలు జగదీశ్వర్, ముజిబ్ లను సన్మానించిన రాజ్ కుమార్




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : కారుణ్య నియమాకుల కోసం విస్తృతంగా కృషిచేసిన టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డా.ఎస్ ఎం. హుస్సేని ముజీబ్ లను టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్ లు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నోడల్ అథారిటీ అనుదీప్ దురిశెట్టి 8 కారుణ్య నియామక ప్రతిపాదనలను ఆమోదించారని వెల్లడించారు. హైదరాబాద్ డిఈఓ రోహిణి 6 కారుణ్య నియామక ప్రతిపాదనలను సమర్పించారు. అందులో ఎన్ మాధురి, సయ్యద్ షుజావుద్దీన్, మొహమ్మద్ షాజాయిబ్ ఖాన్, 4 మొహమ్మద్ అమీర్ ఖాన్స్, కె.ఎం. ఎం శ్రీనాథ్, దాసరిచిన్న తిమ్మయ్య హెచ్ పేర్లతో ప్రతిపాదనలు పంపించారన్నారు.మొహమ్మద్ గౌస్ ను జిహెచ్ఎస్ యూసుఫ్ గూడా లో ఆఫీస్ సబార్డినేట్ గా, ఇస్మాయిల్ బేగ్ ను జిహెచ్ఎస్ హుమాయున్ నగర్ లో ఆఫీస్ సబార్డినేట్ గా నియమించారు. ఈ ఫైల్ను అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెంట్ జి. రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఖాజా షోయిల్ అహ్మద్ లు ఫైల్ ను ప్రాసెస్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలోరుగేష్, జయంతి రెడ్డి, మైరవి, ముజ్జయిద్, ప్రియ, రమేష్, సుదర్శన్, శివ, అకీల్, చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, దామోదర్, కిరణ్ భగవాన్, షుజా, దాసరి చిన్న తిమ్మపా, అమీర్, మాధురి రాకేష్, తాయర్, పరమేష్, దామోదర్, మధు, ఐజాజ్ పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాస్థాయిలో పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదన కలెక్టర్ విద్యాచందన పంచాయతీ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ మరియు రెవెన్యూ శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. పంచాయతీ రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.50 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో తక్కువ సంఖ్యలో పెండింగ్ లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అశ్వరావుపేట మున్సిపాలిటీగా రూపాంతరం చెందినందున మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి కావలసిన లాగిన్ లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట అదనపు లాగిన్ల ద్వారా అధికారులు సమన్వయంతో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# బోడగుట్ట ప్రీమియం లీగ్ విజేత రౌడీ లెవెన్ కొత్తూరు

**హోరాహోరీగా పోరాడి ఓడిన వైఎన్సీసీ జట్టు**

**పోటీల్లో క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి: ఎమ్మెల్యే కోరం**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు పట్టణంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలో పరశురాం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొగ్గుట్ట ప్రీమియం లీగ్ కెకె ట్రోఫీని కొత్తూరుకు చెందిన రౌడీ లెవెన్ జట్టు కైవసం చేసుకుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న బీపీఎల్ లీగ్లో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. సోమవారంతో రౌడీ లెవెన్ మరియు వైఎన్సిసి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన రౌడీ లెవెన్ జట్టు ఫీలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ కు దిగిన వైఎంసిసి జట్టు పది ఓవర్లలో 59 పరుగులు చేసి ఆలౌట్ అయింది. 60 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రౌడీ లెవెన్ జట్టు కేవలం 5 ఓవర్లలోనే విజయాన్ని నమోదు చేసింది. ముగింపు కార్యక్రమానికి ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరిలో స్నేహబావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని, గెలుపోటలు సహజమని, గెలిచామని పొంగి పోకూడదని, అలాగే ఓడిపోయామని కుంగి పోకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం రన్నరర్గా నిలిచిన వైఎన్సిసి జట్టుకు సైతం బహుమతి అందచేశారు. టోర్నమెంట్ నిర్వహణ నిమిత్తం నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య రూ.30 వేలు, రెండో బహుమతి దండుసారయ్య, మూడో బహుమతికి ఏఈ అలీ స్పాన్సర్లుగా వ్యవహరించారు. బొగ్గుట ప్రీమియర్ లీగ్కు సంబంధించిన ట్రోఫీలను రాజు శ్యామ్ కుమార్ కోరి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ టీంల క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# తెలుగు సంస్కృతిక కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలి

* **ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ**
* **కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు అవార్డులు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : తెలుగు సంస్కృతిక కళలను భావితరాలకు అందించడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్య కళా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు నగరంలోని బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్ 2025 ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నృత్య పోటీలలో హైదర్ నగర్ లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో నిర్వహించిన బిందు మాధవి, భావనల తోపాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రధానం చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందని చిన్న వయస్సులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రుహానా కూచిపూడి నృత్య అకాడమీ బృందాన్ని ఆయన ఆశీర్వదించారు. కూచిపూడి నృత్యాన్ని ప్రోత్సహిస్తున్న రుహాన కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. చిన్నారులు తమ వయస్సుతో సంబంధం లేకుండా అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాఖర్ తెలుగు టీవీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టైలర్ వృత్తిదారులకు ఆర్థిక చేయూతనివ్వాలి

* **ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేట్ సంస్థలు, మాల్స్ ఏర్పాటుతో నష్టపోయి ఉపాధి కోల్పోతున్న టైలర్ వృత్తి దారులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామవరం పంజాబ్ గడ్డ సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జమలయ్య మాట్లాడుతూ అనాదిగా టైలర్ వృత్తిపై ఆదారిపడి జీవిస్తున్న కుటుంబాలు రెడీమేడ్ వస్త్రాల ప్రవేశంతో ఉపాధి కోల్పోయి వారి కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల, వసతి గృహాల విద్యార్థుల యూనిఫారంను టైలర్లకు అప్పగించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా కోలి చెల్లించాలని, వీరు ఆర్థికంగా స్థిరపడేందుకు సిఎం స్వయం సహాయక నిధి నుంచి ఒక్కో కుటుంబాలని రూ.5 లక్షల వడ్డీలేని ఋణం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహాలు, ఇతర సంక్షేమ పథకాలు అందించి భరోసా కల్పించాలని కోరారు. సమావేశంలో టైలర్లు ఎన్ నాగేశ్వరరావు, రమేషు, కొండ శ్రీనివాసు, సురేష్, సాయి, స్నేహ, రమా, సోనీ, కావ్య, కమల తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కొత్త మెడికల్ కాలేజీలు నిర్మాణం..

**అధికారులకు కీలక ఆదేశాలు**

మెడికల్ విద్యార్థులకు, పేషెంట్లకు ఇబ్బంది కలిగించొద్దని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ ఆస్పత్రుల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేషంట్లకు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పనులను విభజించుకోవాలని సూచించారు. వర్షాకాలం వచ్చేలోపు ముఖ్యమైన పనులన్ని పూర్తి చేసే విధంగా సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో విలేకరుల పాత్ర కీలకం

* **మల్కాజ్గిరి పార్లమెంట్ శాసన సభ్యుడు ఈటెల రాజేందర్**



మేడ్చల్ , ప్రజాస్ఫూర్తి : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో విలేకరుల పాత్ర కీలకమని మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ శాసన సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టియుడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ కు టీయూడబ్ల్యూజే, రాష్ట్ర, మేడ్చల్ జిల్లా డైరీ ని జిల్లా యూనియన్ ప్రతినిధుల తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరుల కు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉద్యోగ రక్షణ లేకుండా విధులు నిర్వహిస్తున్నారని వారి అభ్యున్నతి కోసం తాను కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మల్కయ్య, హరినాథ్, జిల్లా కమిటీ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, విజయ్,ఏవి శ్రీధర్ రావు, గంగరాజు, రాజుగల్ల భూపాల్, క్యాతం రవి, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు పల్ల మహేందర్ రేడ్డి , కూకుట్ల నరోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతినగర్ లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

* **జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళికి వినతి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రగతినగర్ లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ , ఫర్ ఎ బెటర్ సోసైటి తరపున సోమవారం జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి ని కలిసి అన్ని అంశాలను చర్చించారు.100హెచ్ పీ మోటార్లు ఆర్డర్ చెసాము 100 హెచ్పీ మోటార్లు అందిన వెంటనే మరిన్ని నీటిని పంపింగ్ చేయడం ధ్వరా 60% నీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం నుండి డైరెక్ట్ పైప్లైన్ పూర్తయిన తర్వాత మనకు ఎక్కువ నీరు లభిస్తుందని తద్వారా నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వీలైనంత త్వరగా మనతాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి వర్క్ఇన్స్పెక్టర్ మల్లేష్, మేనేజర్ ఈడీపీ హరికృష్ణ, బీఆర్ఎస్ పార్టీ 6వ డివిజన్ అధ్యక్షులు ఉప్పు జస్వంత్, శేషసాయి,సాంబశివ రావు, శ్రీకాంత్, బీఆర్ఎస్ పార్టీ 6వ డివిజన్ యువజన అధ్యక్షుడు సాయి కుమార్, మణికంఠ, స్థానిక కాలనీ నివాసితులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (100) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియల తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పెండింగ్ లో ఉండటం వలన అభ్యర్థులు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి విషయాన్ని జిల్లా అధికారులు గమనించాలన్నారు.వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పోస్టర్ ను జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టరు విడుదల చేసారు.

## ఆకారమే కాదు ఆలోచన కూడా పెద్దదిగా ఉండాలి.. హరీష్ రావుపై ఎమ్మెల్సీ ఫైర్

చూడడానికి ఆకారం పెద్దగా ఉంటే సరిపోదు.. ఆలోచన కూడా పెద్దదిగానే ఉండాలని హరీష్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద అనుకోని ప్రమాదం జరిగి కార్మికులు చనిపోతే.. ప్రభుత్వం మీద బురదజల్లడమే పనిగా మాట్లాడటం సరికాదని అన్నారు. సోమవారం బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతీ విషయంలోనూ హరీష్ రావు రాజీనామా చేస్తా అంటాడు, రుణమాఫీ విషయంలో సవాల్ చేసి ఎందుకు రాజీనామా చేయలేదన్నారు. రాజీనామా చేయకపోగా.. మాట మార్చారని ఎద్దేవా చేశారు. ప్రతీ విషయంలో ఆరోపణలు చేయడం, సవాళ్లు చేయడం, తర్వాత సైలెంట్ కావడం హరీష్ రావుకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. బాధ్యతగల ప్రభుత్వంగా ఎస్ఎల్ బీసీ విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, విమర్శలు చేయడం సరైంది కాదన్నారు.

## కార్మిక చట్టాల అమలు కోసం పోరాడేది సిఐటియు సంఘమే

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కార్మిక హక్కుల కోసం కార్మిక చట్టాల అమలు కోసం పోరాడేది సిఐటియు సంఘమేనని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సోమవారం సిఐటియు షాపూర్ నగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండలం వివిధ బస్తీలలోని సెంట్రింగ్ కార్మికులు ఆయన సమక్షంలో సీఐటీయూ లో చేరారు. ఈ కార్యక్రమంలో కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండల పరిధిలో సెంట్రింగ్ కార్మికులు సిఐటియు నాయకత్వం మీద ఉన్న నమ్మకంతో సంఘంలో చేరడం జరిగిందన్నారు. సెంట్రింగ్ కార్మికులకు గుత్తేదారుల నుంచి గాని బిల్డర్స్ నుంచి గాని ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సిఐటియు సంఘం వాళ్లకు అండగా ఉంటుందని వాళ్ళ సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం అవుతామని, ఇప్పటికే, భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల విషయంలో పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి ప్రమాదం జరిగిన కార్మికులకు నష్టపరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పేరుకే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వడంతోనే అధికారులు చేతులు దులిపేసుకున్నారని భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు గుర్తింపు కార్డులు ఉన్న ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు మొత్తం కూడా దళారులమయమైందని నిరక్షరాస్యులైన భవన నిర్మాణ కార్మికులను దళారులు, సంక్షేమ బోర్డు అధికారులు దోపిడీ చేస్తున్నారని వందల కోట్ల రూపాయలు కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ప్రభుత్వ అవసరాలకు వాడుకుంటు నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నారని పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు సంవత్సరాలు గడిచిన పరిహారం అందడం లేదని ఏదైనా ఒకరిద్దరికి వచ్చిన డబ్బుల్లో నుంచి దళారులకే సగం పోతున్నాయని మరణించిన కార్మికుడి కుటుంబానికి సగం డబ్బులు వస్తున్నాయని వెంటనే ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇల్లు ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, మధు, దిగంబర్, చంద్రకాంత్, దీపక్, మారుతి, కిషోర్, రవి, కరీం, రోషన్, సుధా, సతీష్ తదితరులు పాల్గొన్నారు

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైందని బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు అన్నారు. సోమవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రాజు కాలినిలోని ఎలిమ్ ఏం.బి చర్చ్ కమిటీ వారు ఏర్పాటు చేసినా 13 సీసీటీవీ కెమెరాలను ఏసీపీ హనుమంతా రావుతో పాటు సీఐ నర్సింహా రాజు, ఎస్ఐ రాంనారాయణ్, చర్చ్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడుతూ నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న బాలానగర్ పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ప్రస్తుతం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో దోపిడీ, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే విధంగా భద్రతాపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సీసీ కెమెరాలు నేరస్థులపై గట్టి నియంత్రణ సాధించడానికి ముఖ్యమైన సాధనమన్నారు. . ప్రతి ఇంటి యజమాని సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా భద్రతను మెరుగుపరచుకోవాలని సూచించారు. సీసీటీవిలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధిస్తాయని, వాటి ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అనుమానాస్పద వ్యక్తులు, సంఘవిద్రోహ శక్తులు స్థానికంగా సంచరిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండడం ఎంతో అవసరం అన్నారు. ఏమైనా అనుమానిత వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100 లేదా 9490617444 సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జైపాల్, జ్యోతి బాబు, పరంజ్యోతి (సోను), సందీప్, రవి కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## టి ఫైబర్‌పురోగతి భవిష్యత్తు ప్రణాళికలపై కేంద్రమంత్రి సమీక్ష

తెలంగాణ బ్యూరో : తెలంగాణలో టి ఫైబర్‌పురోగతి భవిష్యత్తు ప్రణాళికలపై కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం నాడు అధికారులతో భేటీ అయ్యారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి , సమాచార శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం హైదాబాద్‌లో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. టీ ఫైబర్‌పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలను చర్చించినందుకు గాను తాను సంతోషంగా ఉన్నానని పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం నాడొక సమావేశంలో ప్రారంభించారు. డిజిటల్ కనెక్టివిటీని వేగవంతం చేయడానికి తెలంగాణలోని ప్రతి ఇంటిని శక్తివంతం చేయడానికి ఈ చర్య దోహదపడుతుదన్నారు.

## పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు కాస్త సమయాన్ని కేటాయించాలి

*** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు కాస్త సమయాన్ని కేటాయిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ షాపూర్ నగర్ రైతు బజార్ వద్ద గల ఎం.జె. గార్డెన్స్ నందు నిర్వహించిన "సాయి లతా మోడల్ హై స్కూల్" వార్షికోత్సవ వేడుకలకు ఆయనతో పాటు కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, పలు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల చిన్ననాటి నుండే పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జె.దయాకర్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ విద్యతోపాటు,క్రీడలు సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అహుతులను అలరింపజేశారు. అదే విధంగా పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు మధుమోహన్, సాజిద్, తాటి రవి కుమార్, జైపాల్, అంజి గౌడ్, నవీన్, పాఠశాల కరస్పాండెంట్ జె.దయాకర్, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామేశ్వర్ రెడ్డి, ట్రాపసా చైర్మన్ వెంకటేష్, అధ్యక్షులు వినోద్ జాదవ్, మేడ్చల్ జిల్లా జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ఆంజనేయులు, గిరి, నర్సింహులు, వీరన్న, శ్రీశైలం, నర్సింహులు గౌడ్, భాషా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.
















# రష్యాతో యుద్ధం ముగింపు సుదూరం..! జెలెన్‌స్కీ

కీవ్: రష్యాతో యుద్ధం ముగింపు కోసం అడుగులు పడుతున్న వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధానికి ముగింపు ఇప్పట్లో కనిపించడం లేదని, చాలా దూరంలో ఉందన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్ష భవనంలో చోటుచేసుకున్న వాగ్వాదంపై స్పందిస్తూ.. అగ్రరాజ్యం నుంచి తదుపరి మద్దతు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "అమెరికాతో మా సంబంధం కొనసాగుతుందని భావిస్తున్నా. ఎందుకంటే ఇది ఇప్పటి బంధం కాదు" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా చేస్తున్న సాయాన్ని ఆయన గుర్తు చేశారు. అమెరికాతో బలమైన భాగస్వామ్యం ఉందని భావిస్తున్నానని చెప్పారు. అమెరికాతో డీల్‌కు తాను సిద్ధమేనన్న ఆయన.. అమెరికాకు ఉక్రెయిన్ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారన్నారు. రష్యా యుద్ధానికి తెర దించడానికి శాంతి ఒప్పందం కుదర్చడం, దానికి బదులుగా ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా చేసిన ప్రతిపాదనపై



చర్చించడానికి జెలెన్‌స్కీ ఇటీవల వైట్‌హౌస్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్‌తో చర్చలు జరిపిన ఆయన.. భవిష్యత్తులో రష్యా దాడి నుంచి రక్షణ కల్పించాలని ఒత్తిడి చేశారు. ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌లకు ఆగ్రహం తెప్పించింది. సాయం అందించిన దేశానికి కృతజ్ఞతలు చెప్పడం మాని.. అవమానిస్తున్నారంటూ జెలెన్‌స్కీపై మండిపడ్డారు. ఈ చర్చలు కాస్తా రసాభాసగా మారడంతో ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే శ్వేతసౌధం నుంచి జెలెన్‌స్కీ బయటకు వచ్చేశారు.

# మీరు మాట్లాడేది మనుషుల గురించేనా..?

* **పని గంటలపై అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు**



ఉద్యోగుల పనిగంటల పై దిగ్గజ పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై తాజాగా ఎస్పీ అధినేత, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ''ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సలహా ఇస్తున్నవారు.. మనుషుల గురించి కాకుండా రోబోల గురించి మాట్లాడటం లేదుకదా. ఎందుకంటే, మనుషులైతే.. భావోద్వేగాలతో మెలగాలని, కుటుంబంతో కలిసి జీవించాలని అనుకుంటారు. ఎవరో కొద్దిమందికి కాకుండా దేశప్రజలందరికీ లబ్ధి చేకూర్చేదే నిజమైన ఆర్థిక పురోగతి. పనిలో నాణ్యత ముఖ్యం. ఉన్నతహోదాలో కూర్చున్న వ్యక్తులు.. యువత చేసే హార్డ్‌వర్క్ నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందుతున్నారన్నది నిజం. అందుకే వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఆచరణకు వీలుకాని సలహాలు ఇస్తుంటారు. ఆర్థిక పురోగతి వల్ల కొందరికే లాభం కలిగితే.. ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్లు లేక 100 ట్రిలియన్లకు చేరడం వల్ల సామాన్యుల జీవితాల్లో వచ్చే తేడా ఏముంటుంది..? ఆర్థిక ప్రయోజనాలు అందరికీ అందడమే నిజమైన ఆర్థిక న్యాయం. ఈ ప్రభుత్వ హయాంలో అది సాధ్యంకాదు'' అని ఎక్స్ వేదికగా భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటల చొప్పున పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని, ఇంట్లో కూర్చొని ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తాజాగా నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ వారానికి 80 లేక 90 గంటలైనా సరే భారతీయులు కష్టపడి పనిచేయాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ల నుంచి 30 ట్రిలియన్లకు మారాలంటే.. వినోదమో, సినీ తారల అభిప్రాయాలను అనుసరించడం వలనో సాధ్యంకాదని పేర్కొన్నారు. కష్టపడి పనిచేయకపోవడం గురించి మాట్లాడటం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యలు చేశారు.

# ఐఐటీ బాబాపై కేసు నమోదు



ఇటీవల ప్రయాగ్‌రాజ్ వేదికగా జరిగిన అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక కుంభమేళాలో ఐఐటీ బాబాగా అభయ్ సింగ్ పాపులర్ అయిన సంగతి తెలిసిందే. మరోసారి ఆయన వార్తల్లో నిలిచారు. ఇటీవల తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ..ఆత్మహత్య చేసుకుంటానని ఆయన సోషల్ మీడియా వేదికగా పలు పోస్టులు చేశారు. తాజాగా అతడు జైపుర్‌లో కొందరు వ్యక్తులతో తగాదాకు దిగినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా ఐఐటీ బాబా వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాను ఎటువంటి తగాదాలకు వెళ్లలేదని తన అనుచరులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకొంటున్నానని చెప్పారు. ఆయనపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డిపిఎస్) చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఆయన వద్ద లభించిన గంజాయి అనుమతించదగిన పరిమితిలో ఉండడంతో కొన్ని గంటల తర్వాత ఆయనను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. హరియాణాకు చెందిన అభయ్ సింగ్.. ఐఐటీ బాంబేలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేసినట్లు చెబుతున్నారు. కొంతకాలం కార్పొరేట్ సంస్థలో పనిచేసిన ఆయన.. దాన్ని వదులుకొన్నారు. ఈక్రమంలో ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశారు. కుంభమేళాకు వచ్చి ఓ వార్తా ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇవ్వడంతో ఆయన పేరు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది.

# దారుణం..నెల రోజుల శిశువుకు 40 వాతలు

భువనేశ్వర్: ఒడిశాలోని నవరంగాపూర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. చికిత్స పేరుతో అనారోగ్యంతో బాధపడుతున్న నెల రోజుల శిశువుకు కుటుంబ సభ్యులు ఇనుప కడ్డీని కాల్చి శరీరంపై 40 వాతలు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది చిన్నారిని వెంటనే దగ్గరలోకి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. గంభరిగూడ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఈ ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కుటుంబంలోని నెల రోజుల వయసున్న ఓ చిన్నారి వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబుతో బాధపడుతోంది. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో కుటుంబసభ్యులు పసివాడికి గాలి సోకిందని



భావించారు. వైద్యం అందించడానికి బదులు మూఢనమ్మకాలకు ప్రభావితమై.. ఇనుప కడ్డీని కాల్చి దానితో శిశువు శరీరంపై 40 చోట్ల వాతలు పెట్టారు. అనంతరం చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించడంతో పంచాయతీ సిబ్బంది స్థానిక ఉమర్‌కోట్ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అనారోగ్యం పాలైన వారికి ఈ విధంగా వేడి లోహంతో ముద్ర వేయడం వల్ల శరీరంపై ఉన్న దుష్టశక్తులు పోతాయని అక్కడి వారు నమ్మతారని అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా చిన్నారి తలపై, కడుపుపై 40 వాతలు పెట్టారని అన్నారు. విషయం తెలుసుకున్న నవరంగాపూర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పండా ఆస్పత్రిని సందర్శించి శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మారుమూల గ్రామాల ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



## పోలీసులు ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యాన్ని అర్థం చేసుకోవాలి

**: సుప్రీం కోర్టు**

భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయ్యిందని, పోలీసులు కనీసం ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. రెచ్చగొట్టే పాటను షేర్ చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ విధంగా స్పందించింది. ఈ కేసు తీర్పును రిజర్వ్ చేసింది. గుజరాత్ జామ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ సామూహిక వివాహాల కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పాల్గొన్నారు. అనంతరం ఓ పద్యంతో కూడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో షేర్ చేయడం వివాదాస్పదమైంది. ఆ పాట ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొంటూ జనవరి 3న ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ.. అక్కడ ఆయనకు ఊరట లభించలేదు. దీంతో ప్రతాప్‌గఢీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) కింద భావప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కు పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి వివరించింది. అది కేవలం పద్యం మాత్రమేనని, అనువాదంలో కొంత సమస్య ఏర్పడి ఉండవచ్చని అభిప్రాయపడింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పోలీసులు కొంత సున్నితత్వాన్ని ప్రదర్శించాలని పేర్కొంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు అవుతుండగా.. కనీసం ఇప్పటికైనా భావప్రకటనా స్వేచ్ఛ గురించి పోలీసులు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.

## అసభ్య పదజాలం 'టాలెంట్' కాదు..

# అల్లాబాదియాకు సుప్రీంలో ఊరట

ఇండియాస్ గాట్ లాటెంట్' వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశమంతటా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో అల్లాబాదియాకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. పాడ్‌కాస్ట్‌ను రద్దు చేయాలన్న ప్రాసిక్యూషన్ వాదనను తిరస్కరించిన న్యాయస్థానం.. దానిని తిరిగి



పునఃప్రారంభించేందుకు యూట్యూబర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా అల్లాబాదియాకు న్యాయస్థానం మరోసారి చురకలు అంటించింది. భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణను పొడిగించిన ధర్మాసనం.. గువహాటిలో నమోదైన కేసులో దర్యాప్తునకు హాజరు కావాలని ఆదేశించింది. నైతికత, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. డిజిటల్ కంటెంట్‌పై మార్గదర్శకాలు రూపొందించేటప్పుడు ఈ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

# కాంగ్రెస్ నేత హిమానీ నర్వాల్ హత్య కేసులో ఒకరి అరెస్టు

రోహ్‌తక్: హరియాణాకు చెందిన యువ కాంగ్రెస్ నాయకురాలు హిమానీ నర్వాల్ హత్య కేసు సంచలనం సృష్టించింది. దుండగులు ఆమెను మార్చి 1న హత్య చేసి, మృతదేహాన్ని సూట్ కేసులో కుక్కి రోహ్‌తక్‌ఢిల్లీ హైవేపై పడేశారు. ఈ కేసులో నిందితులను త్వరగా పట్టుకోవడానికి పోలీసులు సిట్‌ను ఏర్పాటుచేశారు. ఇందులోభాగంగా ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. కాగా, ఆమెను హత్య చేసింది తానేనంటూ నిందితుడు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమెతో తనకు సన్నిహిత సంబంధం ఉందని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. తరచూ తన నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతోనే ఆమెను చంపేశానని అతడు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఫిబ్రవరి 27 మధ్యాహ్నం



వరకు తాను తన కుమార్తెతో ఉండి.. అదే రోజు సాయంత్రం దిల్లీలో ఉన్న తన కుమారుడి వద్దకు వెళ్లినట్లు హిమానీ తల్లి సవిత పేర్కొన్నారు. 28న కాల్‌మాండూలో జరగనున్న కాంగ్రెస్ రోడ్‌షోకి హాజరు కావాల్సి ఉందని కుమార్తె తనతో చెప్పినట్లు తెలిపారు. తన కుమార్తె రాజకీయంగా ఎదుగుతుండడం చూసి సొంత పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఓర్వలేకపోయారని మృతురాలి తల్లి ఆరోపించారు. రాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపిందర్ హుడా కుటుంబంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. దీనిని తట్టుకోలేని పార్టీ నాయకులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని ఆమె ఆరోపించారు. తన కుమార్తెను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసే వరకు ఆమె అంత్యక్రియలు నిర్వహించమని వెల్లడించారు.హిమానీ నర్వాల్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రలోనూ ఆమె రాహుల్‌తో కలిసి నడిచారు. గత ఐదు నెలలుగా రోహ్‌తక్‌లోని విజయనగర్‌లోని తన పూర్వీకుల ఇంట్లో ఒంటరిగా ఉంటూ.. రోహ్‌తక్‌లోని వైష్ కాలేజ్ ఆఫ్ లా నుండి కోర్సును అభ్యసిస్తున్నారు.

# వినికిడి సమస్యలపై అవగహన పెంచుకోవాలి : మంత్రి కొండా సురేఖ

* ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

హైదరాబాద్, 03 మార్చి (ప్రజాస్ఫూర్తి) : నేటి ఆధునిక యుగంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం వల్ల వినికిడి సమస్య లు పెరుగుతున్నాయని, ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య పెరుగుతుందని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం నగరంలోని మా ఇ ఎన్ టీ ఆసుపత్రి లో ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి తండ్రులు చిన్నారుల పట్ల అప్రమత్తం గా ఉండాల్సిన అవసరం ఉందన్నారు, చిన్నతనంలోనే అప్రమత్తంగా ఉంటే భవిష్యత్తులో వినికిడి సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. ప్రభుత్వం పేదలకు సహాయం చేసే సంస్థలకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మా ఈ ఎన్ టీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె ఆర్ మేఘనాథ్ మాట్లాడుతూ వినికిడి లోపం, వినికిడి సమస్యలపై ప్రజల్లో అవగహన కల్పించడానికి మా ఈ ఎన్ టీ ఆసుపత్రి ప్రతి యేటా ప్రపంచ వినికిడి దినోత్సవన్నీ ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. మా ఇ ఎన్ టీ లో ఇప్పటివరకు 700 కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్సలు విజయవంతంగా చేశామని అన్నారు. వినికిడి లోపాన్ని అరికట్టేందుకే ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలియజేశారు. ముందుగా గుర్తిస్తే వినికిడి లోపాన్ని సమూలంగా అరికట్టవచ్చు అని అన్నారు మా ఇ ఎన్ టీ లో రెండు సంవత్సరాలు నిండిన పిల్లలందరికీ ఉచితంగా వినికిడి పరీక్షలు చేస్తున్నామని ఆయన వివరించారు. మా ఇ ఎన్ టి హాస్పిటల్ చైర్మన్ సునీత జీ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని నాలుగు వేల శిశువులకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. పిల్లల్లో ముందుగానే వినికిడి సమస్యను గుర్తించడం ఉత్తమం అని అన్నారు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలలో ఎటువంటి వైఫల్యాలు లేని ఆసుపత్రి మా ఇ ఎన్ టి హాస్పిటల్ అని అన్నారు ఇ కార్యక్రమంలో డాక్టర్ సుజిత రెడ్డి,డాక్టర్ ముర్తుజా డాక్టర్ లక్షిత్, ప్రముఖ ఆడియాలజిస్ట్ వికాస్ నేతృత్వంలోని రీహాబిలిటేషన్ బృందం పాల్గొన్నారు.




# గోళ్ల అందానికి.. ఆరోగ్యానికి..!

**గోళ్లు అందాన్ని పెంచడం మాటెలా ఉన్నా.. అవి పరిశుభ్రంగా లేకపోతే మాత్రం వివిధ అనారోగ్యాల్ని మోసుకొస్తాయంటున్నారు నిపుణులు. అందుకే వీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే అటు గోళ్ల అందమూ ఇనుమడిస్తుంది.. ఇటు ఆరోగ్యంగానూ ఉండచ్చు.. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



**తేమనందించాలి!**

మానిక్యూర్‌లో భాగంగా గోళ్లను ట్రిమ్ చేయడం, షేప్ చేయడం, మర్దన చేయడం, పాలిష్ వేసుకోవడం.. ఇవన్నీ ఎలాగైతే కచ్చితంగా పాటిస్తామో.. అలాగే గోళ్లకు తేమనందించడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ఇందుకోసం మార్కెట్లో ప్రత్యేకమైన మాయిశ్చరైజర్లు/నూనెలు దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించి నెయిల్ క్యుటికల్ దగ్గర్నుంచి బయటివైపు నెమ్మదిగా, మృదువుగా మసాజ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా ఏ కాలంలోనైనా గోళ్లు పొడిబారిపోకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే ఇన్ఫెక్షన్ల బెడదా ఉండదు.

**పాలిష్ మంచిదే!**

నెయిల్ పాలిష్‌లో ఉండే



వివిధ రకాల రసాయనాలు గోళ్ల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయనుకుంటారు కొందరు. కానీ ఈ భావన సరికాదట! ఎందుకంటే.. పదే పదే చేతులు నీళ్లలో తడవడం, ఇతర పనుల రీత్యా.. గోళ్లపై ప్రతికూల ప్రభావం పడకుండా నెయిల్ పాలిష్ రక్షణ కవచంలా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. నిర్ణీత వ్యవధుల్లో దీన్ని తొలగించుకోవడం, ఇందుకోసం ఎసిటోన్ రహిత నెయిల్ పాలిష్ రిమూవర్‌ని ఉపయోగించడం శ్రేయస్కరం అని చెబుతున్నారు. అలాగే పాలిష్ ఎక్కువ రోజులు మన్నాలంటే.. ఇంటి పనులు, గార్డెనింగ్ పనులు చేసే క్రమంలో గ్లోవ్స్ ధరించడమూ ముఖ్యమే!

* **అందుకోసం పది నిమిషాలు!**

రోజూ మనం ఎన్నో రకాల పనులు చేస్తుంటాం.. ఈ క్రమంలో చేతుల్ని శుభ్రం చేసుకున్నంత శ్రద్ధగా గోళ్లను క్లీన్ చేసుకోం. ఈ నిర్లక్ష్యమే వివిధ రకాల వైరల్ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందంటున్నారు నిపుణులు. అందుకే గోళ్లను తరచూ శుభ్రం చేసుకోవడం మంచిదంటున్నారు. ఈ క్రమంలో ఒక బౌల్‌లో నీళ్లు తీసుకొని అందులో టీస్పూన్ బేకింగ్ సోడా, టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమంలో గోళ్లను పది నిమిషాల పాటు ముంచి ఉంచాలి. ఆపై నెయిల్ క్లీనింగ్ బ్రష్‌తో మృదువుగా రుద్ది శుభ్రం చేస్తే వాటిలో ఇరుక్కున్న సూక్ష్మ క్రిములు, మురికి సమూలంగా తొలగిపోతాయి.

**'బయోటిన్' తప్పనిసరి!**

మనం చేసే పనులే కాదు.. తీసుకునే ఆహారం కూడా గోళ్ల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో బయోటిన్ (బి విటమిన్) అధికంగా ఉండే ఆహార పదార్థాల్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి. గుడ్డులోని పచ్చసొన, నట్స్, గింజలు, చిలగడ దుంప, పుట్టగొడుగులు, అరటిపండ్లు, బ్రకలీ.. వంటి వాటిలో బయోటిన్ పుష్కలంగా లభిస్తుంది. అవసరమైతే నిపుణుల సలహా మేరకు దీన్ని సప్లిమెంట్స్ రూపంలోనూ తీసుకోవచ్చు.

**ఇవి కూడా!**

తడిసిన ప్రతిసారీ చేతుల్ని ఎలాగైతే పొడిగా తుడుచుకుంటామో.. గోళ్లనూ అలాగే పొడిగా తుడుచుకోవాలి. ఆపై మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి! పదే పదే గోళ్లు కొరకడం వల్ల గోళ్లు డ్యామేజ్ అవడంతో పాటు వాటిలోని మురికి కడుపులోకి చేరి లేనిపోని ఇన్ఫెక్షన్లకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ అలవాటు మానుకోవడమే మంచిదంటున్నారు నిపుణులు.

* సాధారణంగా మన ఇళ్లలో అందరం ఒకే నెయిల్ కట్టర్/నెయిల్ క్లిప్ ఉపయోగించడం అలవాటు. కానీ దీనివల్ల క్రిములు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. అందుకే ఎవరి కట్టర్ వారికి వేరుగా ఉండడమే మేలంటున్నారు. ఒకవేళ ఉపయోగించాల్సి వస్తే గోరువెచ్చటి నీటిలో ముందుగా కట్టర్‌ను శుభ్రం చేసి పొడిగా తుడిచిన తర్వాతే వాడడం ఉత్తమమని చెబుతున్నారు.

**కాలమేదైనా కొంతమందికి పాదాల్లో చెమట రావడం సహజం! ఆ చెమటకు బ్యాక్టీరియా తోడైతే దుర్వాసన వస్తుంటుంది. ముఖ్యంగా షూ, సాక్సులు ధరించే వారి పాదాలకు గాలి తగలదు. ఫలితంగా ఎక్కువ మొత్తంలో బ్యాక్టీరియా పేరుకుపోతుంది. దీనివల్ల పాదాలు, గోళ్లకు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు. అయితే ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతో ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చంటున్నారు నిపుణులు.**



# పాదాల దుర్వాసనకు వీటితో చెక్!

**బేకింగ్ సోడాతో..**

* పాదాలను శుభ్రం చేసుకోవడానికి బేకింగ్ సోడాని ఉపయోగించడం వల్ల చక్కని ఫలితం ఉంటుంది. దీనికోసం పావు బకెట్ గోరువెచ్చని నీటిలో చెంచా బేకింగ్ సోడా కలపాలి. ఈ మిశ్రమంలో పాదాలు మునిగేలా కొద్దిసేపు ఉంచాలి. బేకింగ్ సోడా ఉపయోగించడం వల్ల చెమటలోని పీహెచ్ స్థాయులు అదుపులో ఉంటాయి. ఫలితంగా దుర్వాసన రావడం తగ్గుతుంది. ఈ విధంగా వారం రోజుల పాటు రాత్రివేళల్లో క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

**అల్లంతో..**

* చిన్న అల్లం ముక్క తీసుకుని దాన్ని బరకగా దంచుకోవాలి. ఒక కప్పు వేడి నీళ్లు తీసుకొని అందులో ఈ అల్లం పేస్ట్‌ని వేసి 10 నుంచి 15 నిమిషాలు ఉంచాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని వడకట్టి చల్లారనివ్వాలి. రోజూ పడుకునే ముందు ఈ మిశ్రమంతో పాదాలకు మృదువుగా మర్దన చేసుకోవాలి. కొద్ది రోజుల పాటు ఇలా చేస్తే ఫలితం కనిపిస్తుంది.

**నిమ్మరసంతో..**

* ఒక బేసిన్‌లో పావుకప్పు బేకింగ్ సోడా వేసి దానికి ఎనిమిది కప్పుల గోరువెచ్చని నీటిని జత చేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా నిమ్మరసం వేసుకొని బాగా కలుపుకోవాలి. ఇందులో పాదాలను 15 నుంచి 20 నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత పొడి టవల్‌తో తుడుచుకుని పాదాలను ఆరబెట్టుకోవాలి.

# విదేశీ మదుపర్ల బెంగ..

**రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్‌పై అమ్మకాల ఒత్తిడి..**

**నష్టాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..!**



**ముంబై:** నిరంతరాయంగా విదేశీ మదుపర్లు నిధులు విత్‌డ్రా చేయడంతో బ్లూ చిప్ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ నష్టాలతో ముగిశాయి. వరుసగా రెండో సెషన్‌లో బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 112.16 పాయింట్లు (0.15శాతం) నష్టపోయి 73,085.94 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 73,649.72పాయింట్ల గరిష్టం నుంచి 72,784.54 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనమైంది.

ఇక, మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా తొమ్మిదో రోజు నష్టాలతో ముగిసింది. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 5.40 పాయింట్ల పతనంతో 22,119.30 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 120 పాయింట్లు పతనమై 22,004.70 పాయింట్లకు పడిపోయింది.

బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మారుతి సుజుకి ఇండియా, యాక్సిస్ బ్యాంక్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్ తదితర స్టాక్స్ నష్టపోయాయి. మరోవైపు అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సెన్ అండ్ టర్బో, ఎస్బీఐ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి.

ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్ లాభాలతో ముగిస్తే, షాంఘై నష్టాలతో స్థిర పడింది. సియోల్ స్టాక్ మార్కెట్‌కు సోమవారం సెలవు. యూరోపియన్ మార్కెట్లు సానుకూలంగా స్థిర పడ్డాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.58 శాతం తగ్గి 72.89 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

## ఉద్యోగులకు హోలీ బొనాంజా..

**డీఏ 3 శాతం పెంపు..?**



**న్యూఢిల్లీ:** హోలీ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవు భత్యం) సరవణ చేయనున్నట్లు తెలిసింది. ఈసారి కూడా డీఏను మరో 3 శాతం పెంచనున్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం 53 శాతంగా ఉన్న కరవు భత్యం 56 శాతానికి చేరనుంది. అయితే, ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మార్చి 14న హోలీ సందర్భంగా అధికారిక ప్రకటన ఉంటుందని తెలిసింది. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జులైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జులై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి డీఏ పెంపు 3 శాతంగానే ఉండనున్నట్లు తెలిసింది. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

## 1,000 మందిపై వేటుకు సిద్ధమైన ఓలా ఎలక్ట్రిక్..

**ఐదు నెలల్లోనే రెండో రౌండ్ లేఆఫ్స్**




**న్యూఢిల్లీ:** ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 1,000 మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని యోచిస్తోంది. నష్టనివారణ చర్యల్లో భాగంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

సంస్థ ఖర్చులను తగ్గించి, నిర్వాహక సామర్థ్యం పెంచేందుకు ఓలా ప్రయత్నిస్తున్నట్లు మీడియా కథనాలు నివేదిస్తున్నాయి. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఈ కోత ఉండనున్నట్లు సమాచారం. తొలగింపు వార్తల తర్వాత ఓలా ఎలక్ట్రిక్ షేర్లు కూడా 5 శాతం పడిపోయినట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల్లోనే ఓలా ఎలక్ట్రిక్‌లో ఇది రెండో రౌండ్ తొలగింపులు. గతేడాది నవంబర్‌లో ఓలా ఎలక్ట్రిక్ దాదాపు 500 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా వెయ్యి మందిపై వేటు వేసేందుకు సంస్థ సిద్ధమైంది.

కాగా, ఇటీవలే కొన్ని రోజులుగా ఓలా ఎలక్ట్రిక్ పలు వివాదాలతో సతమతమవుతోన్న విషయం తెలిసిందే. సంస్థ కార్యకలాపాలు, సేవలపై వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వినియోగదారుల హక్కులు ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ విషయంపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఓలా ఎలక్ట్రిక్‌కు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. అంతేకాదు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కమెడియన్ కునాల్ కమ్రా, భవీశ్ అగర్వాల్ మధ్య వివాదం కూడా నెలకొన్న విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో సంస్థ లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# హ్యాట్రిక్ విజయాలతో జోష్‌లో టీమిండియా

**ఆస్ట్రేలియాతో సమరానికి భారత్ సిద్ధం**

**బలంగా టీమిండియా బ్యాటింగ్ విభాగం!**

**తొలి సెమీఫైనల్‌లో ఇరుజట్లు అమీతుమీ**

**పలు మార్పులతో బరిలోకి భారత్**

**రిషబ్ పంత్‌కు అవకాశం ఇవ్వనున్న మేనేజ్మెంట్**

**దుబాయ్ వేదికగా నేడు మ్యాచ్**





**దుబాయ్:** ఐసీసీ టోర్నీల నాకౌట్ మ్యాచ్‌ల్లో ప్రధాన అడ్డంకిగా నిలిచే ఆస్ట్రేలియా జట్టుతో భారత్ మరోసారి సమరానికి సిద్ధమవుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్‌లో దుబాయ్ వేదికగా ఇరుజట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. గత రికార్డులు చూస్తూ టీమ్?ఇండియాపై ఆస్ట్రేలియాదే పైచేయిగా ఉంది. ఐసీసీ ఈవెంట్ల నాకౌట్ మ్యాచ్‌ల్లో చివరిసారిగా 2011 ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై భారత్ నెగ్గింది. 2015 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్, 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్, అదే ఏడాది వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ తుదిపోరులో కంగారూల చేతిలో టీమ్‌ఇండియా ఓటమిపాలైంది. ఈసారి బలమైన స్పిన్ బౌలింగ్‌తో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టాలని భారత్ యోచిస్తోంది. పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్ వంటి ప్రధాన ఆటగాళ్లు లేకపోయినా ఈ టోర్నీలో ఆస్ట్రేలియా జట్టు బలంగానే కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌పై 350కిపైగా భారీ లక్ష్యాన్ని ఛేదించింది. గ్రూప్ స్టేజ్‌లో హ్యాట్రిక్ విజయాలు సాధించిన టీమ్‌ఇండియా జోష్ మీదుంది. న్యూజిలాండ్‌పై ఓ మోస్తరు లక్ష్యం నిర్దేశించి మరీ కివీస్‌ను ఓడించింది. టోర్నమెంట్‌కు ముందు జట్టులో ఐదుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు అదే స్పిన్ విభాగం జట్టుకు అండగా నిలుస్తోంది. దుబాయ్‌లోని స్లో పిచ్‌లపై మాస్టర్ స్ట్రోక్‌గా నిలుస్తోంది.ఈ టోర్నీలో అన్ని మ్యాచ్‌లు దుబాయ్‌లోనే ఆడుతుండటం కూడా పిచ్ పరిస్థితులపై అవగాహన కలిగేలా చేసి టీమ్‌ఇండియాకు కలిసి వస్తోంది. న్యూజిలాండ్‌పై నలుగురు స్పిన్నర్లను ఆడించాలని తీసుకున్న నిర్ణయం భారత్‌కు అనుకూలాంశంగా మారింది. ఆ మ్యాచ్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు పడగొట్టారు. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లతో సత్తా చాటాడు. ఆస్ట్రేలియాతో జరిగే సెమీఫైనల్‌లో కూడా నలుగురు స్పిన్నర్లతో భారత్ బరిలోకి దిగుతుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. ఆస్ట్రేలియా జట్టులో మాత్రం ఆడం జంపా ఒక్కడే స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఉన్నాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్, ట్రావిస్ హెడ్ పార్ట్‌టైమర్లుగా సేవలందించనున్నారు.ఆస్ట్రేలియా బౌలర్లు ఇంగ్లాండ్ బ్యాటర్లకు 352 పరుగులు, అఫ్గానిస్థాన్ బ్యాటర్లకు 273 పరుగులు సమర్పించుకున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్, శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తోంది. ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్‌ను కట్టడి చేయడంపైనే భారత బౌలర్లు ప్రధానంగా దృష్టిసారించాల్సి ఉంది.మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ వంటి పేసర్లు లేకపోవడం వల్ల ఆ జట్టు ఫాస్ట్ బౌలింగ్ బలహీనంగా మారింది. వీరంతా గాయాల కారణంగా టోర్నీకి ముందే దూరమయ్యారు. స్పెన్సర్ జాన్స్, నాథన్ ఎల్లిస్, డ్వారిషూస్ ఉన్నప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో వారికి అనుభవం తక్కువ. అయితే ఆస్ట్రేలియాకు బ్యాటింగే ప్రధాన బలం. భారత్‌పై దూకుడుగా ఆడే ట్రావిస్ హెడ్ ఫామ్‌లోకి వచ్చాడు. మిడిలార్డర్‌లో లబుషేన్, జోష్ ఇంగ్లిస్, అలెక్స్ కేరీ అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లు. ఫామ్ లేక ఇబ్బంది పడిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ కూడా బ్యాట్ ఝుళిపించడం మొదలుపెట్టాడు. కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఫామ్‌తో సంబంధం లేకుండా ఎలాంటి పరిస్థితుల్లోనైనా పరుగులు రాబట్టగలిగే క్లాస్ ఆటగాడు.ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఆ రోజు ఎవరు బాగా ఆడితే వారికే విజయం వరిస్తుంది. ఇందుకు గత వన్డే ప్రపంచకప్ ఫైనలే ప్రత్యక్ష ఉదాహరణ. అప్పటివరకు వరుసగా పది మ్యాచుల్లో గెలిచి ఫైనల్‌కు వచ్చిన టీమ్‌ఇండియాను ఆసీస్ ఓడించింది. స్వదేశంలో జరిగినప్పటికీ భారత్ పరాజయం పాలైంది. ఐసీసీ టోర్నీలంటే పూర్తి శక్తిసామర్థ్యాలను ప్రదర్శించి ఆడటం ఆస్ట్రేలియా ప్రత్యేకత. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకోవాలంటే ముందుగా ఆస్ట్రేలియా అనే అడ్డంకిని టీమ్‌ఇండియా అధిగమించాలి. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్స్?కు ఆస్ట్రేలియా సిద్ధమవుతోంది. గ్రూప్? స్టేజ్?లో అఫ్గానిస్థాన్?తో మ్యాచ్?లో గాయపడిన ఆల్?రౌండర్? మ్యాథ్యూ షార్ట్ రిప్లేస్?మెంట్?ను అనౌన్స్? చేసింది. సెమీఫైనల్?లో షార్ట్ స్థానాన్ని 23ఏళ్ల కూపర్ కొనొలీ భర్తీ చేయనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తాజాగా ప్రకటించింది. లెఫ్ట్ ఆర్మ్? స్పిన్ ఆల్?రౌండర్? అయిన కూపర్ 2024లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతడు ఇప్పటివరకూ 1 టెస్టు, 3 వన్డే, 2 టీ20 మ్యాచ్?ల్లో ఆసీస్?కు ప్రాతినిధ్యం వహించాడు. దుబాయ్ పిచ్? స్పిన్?కు అనుకూలిస్తుండడం వల్ల ఆసీస్ కూపర్? వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కాగా, తొలి సెమీస్?లో ఆస్ట్రేలియా, భారత్?ను ఢీ కొట్టనుంది. ఇరుజట్ల మధ్య దుబాయ్ వేదికగా మార్చి 4న ఈ మ్యాచ్? జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీం ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో కొన్ని మార్పులు చూడవచ్చు. ఓపెనింగ్ గురించి మాట్లాడుకుంటే, కెప్టెన్, వైస్ కెప్టెన్ జోడీ మరోసారి కనిపిస్తుంది. రోహిత్ శర్మ, శుభ్‌మాన్ గిల్ టీం ఇండియా తరపున ఓపెనింగ్‌లు చేయనున్నారు. ఆ తర్వాత, మూడవ స్థానంలో విరాట్ కోహ్లీ, నాలుగో స్థానంలో శ్రేయాస్ అయ్యర్ ప్లేయింగ్ ఎలెవన్‌లో భాగమవుతారు. ఈసారి, ఐదవ స్థానంలో మార్పు కనిపిస్తుంది. కేఎల్ రాహుల్‌ను తొలగించే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ సిరీస్ నుంచి అతనికి నిరంతర అవకాశాలు లభించాయి. కానీ, అతని ప్రదర్శన ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇటువంటి పరిస్థితిలో, అతన్ని తొలగించి, రిషబ్ పంత్‌కు అవకాశం ఇవ్వవచ్చు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఆల్ రౌండర్లుగా ఆడుతున్నారు. కుల్దీప్ యాదవ్‌ను తొలగించే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను వికెట్లు తీసుకున్నాడు. కానీ, అతను చాలా ఖరీదైనవాడని నిరూపించుకున్నాడు. సెమీ-ఫైనల్స్‌కు అతన్ని తొలగించి, హర్షిత్ రాణా లేదా అర్ష్‌దీప్ సింగ్‌ను జట్టులోకి తీసుకోవచ్చు. వరుణ్ చక్రవర్తి మూడో స్పిన్నర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉంటాడు. న్యూజిలాండ్‌పై 5 వికెట్లు పడగొట్టడం ద్వారా, అతను జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఆ తర్వాత, మహ్మద్ షమీ కూడా ఆడుతున్నట్లు కనిపిస్తుంది.

**భారత తుది జట్టు(అంచనా)**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, మహమ్మద్ షమీ/ హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తీ.

**ఆస్ట్రేలియా జట్టు:** స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కారీ, కూపర్ కొనొలి, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సర్ జాన్సన్, మార్నస్ లాబుషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, తన్వీర్ సంఘ, ఆడమ్ జంపా.

# ఐపీఎల్ జట్లకు కొత్త రూల్స్

**మ్యాచ్ రోజు ప్రాక్టీస్‌కు పూర్తిగా నిషేధం**

**బీసీసీఐ సంచలన నిర్ణయం..**




**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌కు ముందు, భారత క్రికెట్ నియంత్రణ మండలి ఫ్రాంచైజీలకు కొత్త ప్రాక్టీస్ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్పులు క్రికెటర్ల శారీరక శక్తిని కాపాడేందుకు, ఆట పరిస్థితులను సమతుల్యం చేయడానికి చేపట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, గత ఎడిషన్లలో లేనివిధంగా, మ్యాచ్ రోజు ప్రాక్టీస్‌కు పూర్తిగా నిషేధం విధించడం గమనార్హం. 2025లో మ్యాచ్ జరగబోయే రోజున ఏ జట్టుకూ ప్రాక్టీస్‌కు అనుమతి ఉండదు. ఈ నిబంధన వల్ల జట్లు వారి శిక్షణా కార్యక్రమాలను ముందుగానే పూర్తిచేయాల్సి ఉంటుంది. అధికారిక ప్రకటన ప్రకారం, టోర్నమెంట్ ప్రారంభానికి ముందు ఒక్కో ఫ్రాంచైజీకి గరిష్టంగా ఏడు ప్రాక్టీస్ సెషన్లు మాత్రమే అనుమతిస్తారు. అలాగే, ప్రతి జట్టుకు రెండు వార్మప్ మ్యాచ్‌లు లేదా సెంటర్ వికెట్ ప్రాక్టీస్ సెషన్లు మాత్రమే నిర్వహించే వీలు కల్పించారు. ప్రాక్టీస్ సమయంలో ఆటగాళ్ల గాయాలు తగ్గించేందుకు, మ్యాచ్‌లో వారి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.స్టేడియంల నిర్వహణలోనూ కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. ప్రాక్టీస్ వికెట్లు, స్థానిక టోర్నమెంట్‌లు, ఇతర లీగ్ మ్యాచుల నిర్వహణపై కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ముఖ్యంగా, స్థానిక టోర్నమెంట్‌లు, సెలబ్రిటీ లీగ్‌లు, లెజెండ్స్ లీగ్ ఆటలను వేదికలపై నిర్వహించరాదని రాష్ట్ర క్రికెట్ సంఘాలకు ఆదేశాలు పంపింది.జట్లు తమ మొదటి మ్యాచ్‌కు ముందు ఫ్లడ్‌లైట్ల కింద మూడు గంటల పాటు ప్రాక్టీస్ చేయడానికి మాత్రమే అనుమతించబడతాయి. ప్రాక్టీస్ మ్యాచ్‌లు సైడ్ వికెట్లలో మాత్రమే నిర్వహించాలి, వాటి వ్యవధి మూడున్నర గంటలకు మించకూడదు.

ఒకే వేదికలో హోమ్-అవే జట్లు ఒకేసారి ప్రాక్టీస్ చేయాలనుకుంటే,రెండు జట్ల మేనేజ్‌మెంట్‌లతో సంప్రదించి డబుల్ బుకింగ్ సమస్యను పరిష్కరించేలా చూడనుంది. ఒక జట్టు మరో సెషన్ తీసుకోవడం లేదా రెండు జట్లు సమయాన్ని పంచుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తారు.

# కేకేఆర్ కెప్టెన్‌గా రహానే..

**వైస్ కెప్టెన్‌గా వెంకటేశ్ అయ్యర్**

**అధికారిక సోషల్ మీడియాలో కేకేఆర్ వెల్లడి**



**కోల్‌కతా:** ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) తమ కెప్టెన్‌గా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానేను నియమించింది. గత సీజన్‌లో కేకేఆర్‌ను నడిపించిన శ్రేయస్ అయ్యర్.. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలానికి ముందు జట్టును వీడటంతో కొత్త కెప్టెన్‌ను ప్రకటించాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే సీనియర్ ప్లేయర్ అయిన రహానేకు జట్టు పగ్గాలను అప్పగించిన కేకేఆర్.. వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కేకేఆర్ సోమవారం తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించింది.వెంకటేశ్ అయ్యర్‌ను భవిష్యత్తు సారథిగా నియమించాలనే ఉద్దేశంతోనే వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. కేకేఆర్ కెప్టెన్‌గా రింకూ సింగ్‌ను నియమిస్తారని ప్రచారం జరిగినా.. మేనేజ్‌మెంట్ అనుభవానికే ప్రాధాన్యత ఇచ్చింది. టీమిండియాకు దూరమైనా.. దేశవాళీ క్రికెట్‌లో ముంబై సారథిగా రహానే సత్తా చాటుతున్నాడు. గతేడాది రంజీ ట్రోఫీతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలను రహానే సారథ్యంలోనే ముంబై గెలిచింది. కేకేఆర్ తాజా ప్రకటనతో ఢిల్లీ క్యాపిటల్స్ మినహా అన్ని జట్ల సారథులు ఎవరో తేలిపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరిని కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో బరిలోకి దిగే కొత్త జెర్సీని కూడా కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆవిష్కరించింది. మూడు టైటిళ్లు గెలిచామనే విషయం తెలియజేసేలా జెర్సీపై మూడు స్టార్లకు చోటు కల్పించింది. జెర్సీ ఆవిష్కరణకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. 'కేకేఆర్ మూడు టైటిళ్లు గెలిచిందనే విషయాన్ని తెలియజేసేలా జెర్సీపై మూడు స్టార్లు కేటాయించాం. మే 27, 2012, జూన్ 1, 2014, మే 26, 2024న మేం టైటిళ్లు సాధించాం. మిథున రాశి రోజునే ఈ ఫలితాలు వచ్చాయి. గతేడాది గెలిచిన టైటిల్ మమ్మల్ని మళ్లీ అగ్రస్థానానికి చేర్చింది. ఈసారి కూడా అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తాం. మూడు టైటిళ్లకు కర్బో, లోర్బో, జీత్బో అని పేరు పెట్టాం. బెంగాలీ పదాలైన వీటికి ప్రదర్శన, పోరాటం, విజయం అని అర్థం. ఛాంపియన్ వారసత్వాన్ని కొనసాగించేందుకు స్ఫూర్తిగా ఈ పదాలు నిలుస్తాయి.'అని కేకేఆర్ అధికారి బిందా దే తెలిపారు.

# సెమీస్‌లో టీమిండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుంది

**ఒకే వేదికపై మ్యాచ్‌లు ఆడటం చాలా ప్లస్ పాయింట్**

**దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయం**



**న్యూఢిల్లీ:** దుబాయ్‌లో మంగళవారం జరిగే సెమీస్ లో టీమిండియా ఫేవరెట్ గా బరిలోకి దిగుతుందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. ఇప్పటికే ఈ వేదికపై మూడు మ్యాచ్ లు ఆడిన టీమిండియాకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పుకొచ్చాడు. భద్రతా కారణాల వల్ల టీమిండియా.. మెగా టోర్నీలో హైబ్రీడ్ మోడల్లో ఆడుతోంది. దుబాయ్ లోనే మూడు లీగ్ మ్యాచ్ లు ఆడిన భారత్.. ఆసీస్ తో సెమీస్ కు కూడా అక్కడే ఆడనుంది. ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ మ్యాచ్ ను కూడా దుబాయ్ లోనే ఆడుతుంది. ఈ నేపథ్యంలో ఒకే వేదికపై మ్యాచ్ లు ఆడనుండటంతో టీమిండియాకు అది లాభదాయకంగా మారిందని గావస్కర్ చెప్పుకొచ్చాడు. మెగాటోర్నీలో భారత్ మాత్రమే మూడింటికి మూడు గెలిచి అజేయంగా నిలిచింది. ఈ క్రమంలో సెమీస్ లో అడుగుపెట్టి, ఆసీస్ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇక ఈ సెమీస్ కు మ్యాచ్ కు ముందు భారత్ కు గావస్కర్ ఒక సలహా ఇచ్చాడు. ఈ పిచ్ పై టాస్ గెలిస్తే ఛేజ్ చేయాలని టీమిండియాకు గావస్కర్ సూచించాడు. ప్రత్యర్థి జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు పెద్దగా లేరని, అలాగే వారి ప్రీమియర్ బౌలర్లు కూడా అందుబాటులో లేరని గుర్తు చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్, జోష్ హేజిల్ వుడ్, మిషెల్ స్టార్క్ గాయాలతో మెగాటోర్నీకి దూరమయ్యారు. వీళ్ల స్థానంలో అంతగా అనుభవం లేని ముగ్గురు పేసర్లు ఆడుతున్నారు. ఆడం జంపా రూపంలో మాత్రమే వారికి ఒక స్పిన్నర్ అందుబాటులో ఉన్నాడు. దీంతో ముందుగా బౌలింగ్ చేసి ఛేజ్ చేస్తేనే భారత్ కు లాభిస్తుందని పేర్కొన్నాడు. ఇక న్యూజిలాండ్ తో మ్యాచ్ లో ఆడిన జట్టుతోనే సెమీస్ లో బరిలోకి దిగాలని సూచించాడు. టీమిండియాతో జరిగిన మ్యాచ్ లో 250 పరుగుల ఛేదన అసాధ్యమేమీ కాదని, భారత స్పిన్నర్లు రాణించి, జట్టుకు విజయాన్ని అందించారని గావస్కర్ గుర్తు చేశాడు. స్పిన్నర్లకు తొలుత మద్ధతు లభించలేదని, రోలింగ్ చేశాక, లభించిన సపోర్టుతో స్పిన్నర్లు చెలరేగి పోయారని ప్రశంసించాడు. ఇక సెమీస్ కు జట్టులో మార్పులేమీ చేయవద్దని సూచించాడు. ఐసీసీ చాంపియన్స్ టోర్నీ ముగింపు దశకు వచ్చింది. కేవలం మూడు మ్యాచ్ లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మంగళవారం దుబాయ్ లో ఆసీస్ తో టీమిండియా, బుధవారం సౌతాఫ్రికాతో న్యూజిలాండ్ తలపడనున్నాయి.ఫైనల్ మ్యాచ్ ఆదివారం (మార్చి 9న) జరుగుతుంది. 2002, 2013లో రెండుసార్లు మెగాటోర్నీని నెగ్గిన టీమిండియా.. 2017 ఫైనల్లో మాత్రం పాకిస్థాన్ చేతిలో ఓడిపోయింది. ఇందుకు ప్రతీకారంగా ఈ ఎడిషన్ లో జరిగిన లీగ్ మ్యాచ్ లో 6 వికెట్లతో ఓడించి, ఏకంగా టోర్నీ నుంచే సాగనంపింది. ఈసారి కప్పు కొట్టి మూడోసారి ఈ టోర్నీని నెగ్గిన తొలి కంట్రీగా ఆవిర్భవించాలని భారత్ భావిస్తోంది.



# నాలుగు పదుల వయస్సులో అందం తగ్గని ఖడ్గం హీరోయిన్

**టాకీస్:** ఖడ్గం చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు అంత సులువుగా మరిచిపోలేరు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజు ఈ సినిమా తప్పక ప్రసారం కావల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కించగా, ఇందులో హీరో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, రవితేజ, బ్రహ్మాజీ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక కథానాయికలుగా సోనాలి బింద్రే, సంగీత నటించారు. ఇక చిత్రంలో ఓ భామ స్పెషల్ అట్రాక్షన్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె మరెవరో కాదు కిమ్ శర్మ. ముసుగు వెయ్యొద్దు మనసు మీద అంటూ వచ్చే పాటతో ఓ ఊపు ఊపేసిన ఈ చిన్నది తెలుగు అడియన్స్ హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. అయితే చాలా మంది తారలు కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు సినీ పరిశ్రమ నుండి మెల్లగా తప్పుకుంటున్నారు. ఆ కోవలో కిమ్ శర్మ కూడా ఒకరు.ఖడ్గం చిత్రంలో శ్రీకాంత్ వెంటపడినఈ అమ్మాయి ఖడ్గం సినిమాలో వన్ ఆఫ్ ది బెస్ట్ రోల్ లో నటించింది. రామ్ చరణ్ నటించిన మగధీర చిత్రంలో కూడా ఈ భామ స్పెషల్ సాంగ్‌తో అదరగొట్టేసింది. అయితే ఎందుకో ఈ మధ్య తెలుగు సినిమాలలో కనిపించడం లేదు. బాలీవుడ్‌లో సెటిల్ అయిందని తెలుస్తుండగా, అక్కడ పలు సినిమాలతో పాటు స్పెషల్ సాంగ్స్ చేస్తుంది. కిమ్ శర్మ.. బీటౌన్ నటుడు హర్షవర్ధన్ రానాతో ప్రేమాయణం సాగించినట్టు అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. ఇద్దరు పలు మార్లు బయట జంటగా కనిపించారు. అయితే ఏం జరిగిందో ఏమో కాని ఈ ఇద్దరు విడిపోయారు. అయితే సినిమాలకి కాస్త దూరంగా ఉంటున్న కిమ్ శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర ఫొటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది. ప్రస్తుతం కిమ్ శర్మ వయసు 44 ఏళ్లు వయస్సు ఉంటుందని, ఈ వయసులోనూ ఏమాత్రం చెరగని అందంతో అభిమానులను కట్టిపడేస్తుంది అని అంటున్నారు. ఏది ఏమైన ఈ వయస్సులోను కిమ్ శర్మ ఇలా రెచ్చగొడుతుండడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

## వివి వినాయక్ ఆరోగ్యంపై క్లారిటీ



**టాకీస్:** ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో సెలబ్రిటీలకి సంబంధించి జరుగుతున్న ప్రచారాలు అంతా ఇంతా కాదు. బ్రతికి ఉన్న వాళ్లని చంపేయడం, లేని పోని ఎఫైర్స్ అంటగట్టి వారి పరువున బజారున వేయడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వివి వినాయక్ అనారోగ్యం గురించి ఇటీవలి కాలంలో అనేక ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. కొన్నేళ్ల క్రితం వినాయక్‌తో శీనయ్య అనే సినిమాను దిల్ రాజు అనౌన్స్ చేయగా, ఆ సినిమా కోసం వినాయక్ డైట్ మెయింటైన్ చేసి ఫిట్‌గా మారాడు. ఎందుకో అది అర్థాంతరంగా ఆగిపోయింది. హీరోయిన్ సమస్య అని ఫిలిం నగర్ టాక్. ఇక శీనయ్య కోసం వినాయక్ లుక్ పూర్తిగా మారగా, ఆ సమయంలో అతని ఆరోగ్యం గురించి అనేక ప్రచారాలు సాగాయి. ఇక వినాయక్. కొంతకాలం క్రితం లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్నాడనే ఓ టాక్ నడిచింది. అంతేకాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వినాయక్‌ని పరామర్శించేందుకు ఏకంగా డైరెక్టర్ సుకుమార్, నిర్మాత దిల్ రాజు వెళ్లి మరీ పరామర్శించారని అన్నారు. ఆ సమయంలో జరిగిన తప్పుడు ప్రచారాలపై డైరెక్టర్ వివి వినాయక స్పందిస్తూ అవన్నీ ఫేక్ రూమర్స్ అని కొట్టి పారేశారు. ఇక ఇప్పుడు వివి వినాయక్ అనారోగ్యం పాలైనట్టు జోరుగా ప్రచారం సాగుతుండగా, దానిపై ఆయన టీమ్ స్పందించిది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని, వినాయక్ ఆరోగ్యంగానే ఉన్నారని ఆయన టీమ్ పూర్తి వివరణ ఇచ్చింది.

## హైప్‌ను పెంచుతున్న ప్యారడైజ్

**టాకీస్:** వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేశారు. నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ హిట్3 సినిమాకోసం ప్రేక్షకులు ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు అభిమానులు. హిట్ సినిమాల సిరీస్ లో ఇప్పటివరకు విడుదలైన రెండు సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు హిట్ 3తో వస్తున్నారు. శైలేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇటీవలే ఓ టీజర్ ను విడుదల చేశారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా ఈ సినిమాలో కనిపించనున్నాడు నాని. ఇదిలా ఉంటే ఈ సినిమా తర్వాత మరో




యాక్షన్ ఎంటర్టైనర్ తో ప్రేక్షకులను పలకరించనున్నాడు. దసరా సినిమాతో మాస్ హీరో ఇమేజ్ సొంతం చేసుకున్నాడు నాని. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా భారీ హిట్ గా నిలిచింది. కానీ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగెస్ట్ హిట్ గా దసరా సినిమా నిలిచింది. ఇక ఇప్పుడు మరోసారి శ్రీకాంత్ తో కలిసి సినిమా చేస్తున్నాడు నాని. ఈ సినిమాకు ది ప్యారడైజ్ అనే టైటిల్ ను ఖరారు చేశారు. తాజాగా ఈ సినిమా నుంచి గ్లింప్స్ ను విడుదల చేశారు. నాని మరోసారి తెలంగాణ నేపథ్యంలో సినిమా చేస్తున్నాడు. దసరా సినిమాలో తెలంగా యాసలో మాట్లాడిన నాని ఇప్పుడు మరోసారి తెలంగాణ యాసలో అదరగొట్టనున్నాడు.

## ప్రభాస్ సరసన నటించనున్న భాగ్యశ్రీ బోర్సే

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది కల్కి సినిమాతో బాక్సాఫీస్ వద్ద హిట్టు కొట్టాడు డార్లింగ్. ఈ ప్రాజెక్ట్ తర్వాత వరుసగా తన సినిమాలను కంప్లీట్ చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా వరుస సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న రాజా సాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తోన్న ప్రేమకథ చిత్రంలో కొత్త అమ్మాయి ఇమాన్వి కథానాయికగా నటిస్తుంది. ఇదిలా ఉంటే.. తర్వలోనే మరో ప్రాజెక్ట్ స్టార్ట్ చేయనున్నాడు. అసలు విషయానికి వస్తే.. సందీప్ రెడ్డి డైరెక్షన్లో స్పిరిట్ చిత్రంలో నటించనున్నాడు ప్రభాస్. అలాగే డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోనూ ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ సినిమా డిఫరెంట్ గా ఉండనుందని సమాచారం. తాజాగా ఈ మూవీ గురించి ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రభాస్ సరసన మరో కొత్త హీరోయిన్ నటించనుందట. ఆమె మరెవరో కాదు.. భాగ్య శ్రీ బోర్సే.



## ఎంత రెమ్యునరేషన్ ఇచ్చినా ఆ హీరోతో నటించను



**టాకీస్:** దక్షిణాది చిత్రపరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్. అత్యధిక పారితోషికం తీసుకునే సినీతారలలో ఆమె ఒకరు. నయనతార.. సౌత్ ఇండస్ట్రీని ఏలేసిన అమ్మడు. తెలుగు, తమిళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం తన భర్త, పిల్లలతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తూనే మరోవైపు సినిమాల్లోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే.. నయనతార రూ.100 కోట్లు ఇచ్చిన ఓ హీరోతో నటించనని ముఖం మీదే చెప్పేసిందట. షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ సీనియర్ బ్యూటీ, ఆ సినిమాతో సూపర్ డూపర్ హిట్ సాధించింది. ఆ తర్వాత నయనతారకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం కేజీఎఫ్ స్టార్ యష్‌తో కలిసి టాక్సిక్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కోసం పాన్ ఇండియా అభిమానులు ఎదురుచూస్తున్నారు. కానీ ఈ సినిమా షూటింగ్, వివరాలను చాలా గోప్యంగా ఉంచారు. ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి నటిస్తున్నారని సమాచారం. మలయాళ గీతు మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయనతార పాత్ర చాలా ముఖ్యమైనదని తెలుస్తోంది. జవాన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నయన్.. ఈ మూవీ తర్వాత తన పారితోషికం మరింత పెంచిందని టాక్. అయితే ఓ హీరోతో మాత్రం రూ.100 కోట్లు నటించనని చెప్పేసిందట. అతడు మరెవరో కాదు.. శరవణన్. ది లెజెండ్ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. 2022లో విడుదలైన ఈ సినిమా అంతగా హిట్ కాలేదు. అయిత తన సినిమాలో నయనతారను కథానాయికగా తీసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడట. కానీ నయన్ అందుకు ఒప్పుకోలేదు. నయనతారకు బదులుగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా శరవణన్ సరసన హీరోయిన్‌గా నటించింది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపికా పదుకొనే, అలియా భట్ అత్యధికంగా పారితోషికం తీసుకుంటున్నారు. కానీ రూ.100 కోట్లు ఇచ్చినా అతడి పక్కన నటించనని నయన్ చెప్పినట్లు వార్తలు నెట్టింట హల్చల్ అవుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు నయన్ స్పందించలేదు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.